క్లుప్తంగా

వైభవంగా జనార్దనస్వామి కల్యాణం



స్వామివారి కల్యాణం జరిపిస్తున్న పండితులు

కొత్తపల్లి: మండలంలోని రమణక్కపేటలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత విజయ జనార్దనస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం పండితులు అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్టాపన, సహస్రకుంకుమార్చన తదితర పూజాది కార్యక్రమాలు, గ్రామోత్సవం నిర్వహించారు. రాత్రి స్వామివారి కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఫిల్టర్ బెడ్ ప్లాంటు పరిశీలన

సామర్లకోట: పట్టణ ప్రజలకు సరఫరా అవుతున్నా తాగునీరు ఆకుపచ్చ, ఎరుపు రంగులో సరఫరా అవుతోందనే ఆరోపణల మేరకు సోమవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ ఉబా జాన్ మోజెస్, కమిషనర్ సీఎంఎ నయీం అహ్మద్ ఫిల్టర్ బెడ్ ప్లాంటును పరిశీలించారు. ప్లాంటు వద్ద తాగునీరు శుద్ధంగా ఉండటంతో పైపు లైన్లకు లీకులు ఉన్నాయనే అనుమానం వ్యక్తం చేశారు. దాంతో గణపతినగరంలోని ట్యాంకులు, కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని వైస్‌చైర్మన్ ఆదేశాలు జారీ చేశారు. ఏఈ అరవింద్, మాజీ కౌన్సిలర్ గంగిరెడ్డి కృష్ణమూర్తి, మున్సిపల్ ఎంప్లాయిస్ సంఘ అధ్యక్షుడు గిడుతూరి శ్రీనివాసు పాల్గొన్నారు.

చలో ఢిల్లీకి తరలిన కార్మికులు



సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీకి బయలు దేరిన కార్మికులు

సామర్లకోట: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్పొరేట్ అనుకూల విధానాలకు నిరసనగా ఈ నెల 5వ తేదీన ఢిల్లీలో జరుగ నున్న మజ్దూర్ కిసాన్ సంఘర్షణ యాత్రకు సోమవారం భారీగా తరలి వెళ్లారు. ఈ మేరకు కాకినాడ, సామర్లకోట, పెద్దాపురం, తుని, పిఠాపురం ప్రాంతాల నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలు, మిడ్‌డే మీల్స్ వర్కర్లు, ఆశా వర్కర్లు, బిల్డింగ్ వర్కర్లు, హమాలీస్, వ్యవసాయ కార్మిక సంఘాల నాయకులు సామర్లకోట రైల్వే స్టేషన్ నుంచి ఢిల్లీ బయలుదేరారు. ఈ సందర్భంగా అఖిల భారత సీఐటీయూ ఉపాధ్యక్షురాలు జి. బేబీరాణి మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నాయకత్వంలో నరేంద్ర మోదీ పేదల పై భారాలు మోపుతోందని ఆరోపించారు. కేవలం పెట్రో ఉత్పత్తుపైన ఏడాది కాలంలో రూ.మూడు లక్షల కోట్ల భారం వేశారన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శులు బాలం శ్రీనివాసు, డి.క్రాంతికుమార్, రెండు మండలాల ఉపాధ్యక్షులు కరణం ప్రసాదరావు, దాడి బేబీ పాల్గొన్నారు.

గోపీశర్మకు 'దైవజ్ఞ భూషణ' బిరుదు



ఒంగోలులో గోపీశర్మను సత్కరిస్తున్న నిర్వాహకులు

పెద్దాపురం: స్థానిక వర్జుల వారి వీధిలోని లక్ష్మీ లలితా వాస్తు జ్యోతిష్య నిలయం భువనేశ్వరి పీఠాధిపతులు, పంచాంగ కర్త చింతా గోపీశర్మ సిద్ధాంతికి 'దైవజ్ఞ భూషణ' బిరుదు లభించింది. ఒంగోలులో డాక్టర్ జూటూరి భానుమూర్తి పంచాంగ రచన రజతోత్సవంలో భాగంగా ఏప్రిల్ రెండవ తేదీన ఈ అవార్డుతో గోపిశర్మను సత్కరించారు. శోభకృత్ నామ సంవత్సరంలో రాష్ట్ర వ్యాప్తంగా పంచాంగ కర్తల్లో గోపిశర్మకు దైవజ్ఞ భూషణ బిరుదు రావడంపై పట్టణ ప్రముఖులు గోపిశర్మ సిద్ధాంతిని అభినందించారు.

అన్నసమారాధన

కొత్తపల్లి: వాకతిప్పలోని పద్మశాలి రామాలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శ్రీరామ నవమి ముగింపు వేడుకలను పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. వాకతిప్ప, కొత్తపల్లి, కుతుకుడుమిల్లి, ఉప్పాడ, యండపల్లి తదితర గ్రామాలకు చెందిన మూడు వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. గ్రామ సర్పంచ్ పాలని దొరబాబు, ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జా

- యథేచ్ఛగా పెరిగిపోతున్న ఆక్రమణలు
- పట్టనట్టు వ్యవహరిస్తున్న అధికారులు



ఉండూరు రోడ్డు మార్జిన్‌లో పెరుగుతున్న ఆక్రమణలు

సామర్లకోట: మండల పరిధిలోని ఉండూరు రోడ్డులో ప్రధాన పంట కాలువపై రోజు రోజుకు ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. సామర్లకోట గోదావరి కాలువ నుంచి అయ్యప్పస్వామి ఆలయం వద్ద నుంచి పంట కాలువలోకి నీరు వచ్చేలా కాలువను ఏర్పాటు చేశారు. ఇటీవలి కాలంలో పంట కాలువలో తుప్పలు పెరిగి పోవడంతో ఉపాధి పనులతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పంట కాలువలోని తుప్పలను తొలగించారు. ఉండూరు పంట కాలువపై సుమారు మూడు వేల ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతుంది. ఈ కాలువను ఆక్రమిస్తూ రోడ్డు మార్జిన్లలో ఇళ్ల నిర్మాణాలు, పశువుల షెడ్లు, వాటర్ ప్లాంట్, సర్వీసింగ్ సెంటర్లు వెలిశాయి. అంతే కాకుండా చెత్తను పంట కాలువలో వేస్తుండడంతో త్వరత్వరగా పూడిక పేరుకుపోతోందని ఒక పక్క రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యాలయం నుంచి ఉండూరు రైల్వే గేటు రోడ్డులో ఆక్రమణలు పెరిగి పోతున్నా అధికారులు మౌనం వహిస్తున్నారు. ఒకపక్క ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్లు నిర్మిస్తుంటే మరో పక్క రోడ్డు పక్క మార్జిన్లలో ఈ ఆక్రమణలేమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సామర్లకోట నుంచి ఉండూరు, కాపవరం, పి.వేమవరం, గొంచాల, అచ్చంపేట, నవర, చంద్రంపాలెం గ్రామాలకు రాక పోకలు సాగిస్తారు. ఇటీవల కాలంలో ఉండూరు రోడ్డు మీదుగా కాకినాడ నుంచి భారీ వాహనాల రాక పోకలు పెరిగి పోయాయని, రోడ్డు మార్జిన్‌లో ఆక్రమణతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలను తొలగిస్తాం



ఆదివారం కావడంతో పంచాయతీ సిబ్బంది లేక పోవడం వల్ల రోడ్డు మార్జిన్‌లో అక్రమ నిర్మాణాలు చేపడుతుండవచ్చు. తమ సిబ్బందిని పంపి ఆక్రమణలను నిలిపివేస్తాం. సోమవారం నాటికి అక్రమ నిర్మాణాలు తొలగించకుంటే తగు చర్యలు తీసుకుంటాం. – కుమార్‌రాజా, పంచాయతీ కార్యదర్శి, ఉండూరు

నేరేడు పండ్లకు మంచి గిరాకీ



కొత్తపల్లిలో నేరేడు పండ్లు అమ్ముతున్న వ్యాపారి

కొత్తపల్లి: ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే నేరేడు పండ్లకు మార్కెట్లో గిరాకీ పెరిగింది. నేరేడు పండ్లలో మంచి పోషకాలు ఉండడంతో వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. మధుమేహం ఉన్నవారికి నేరేడు పండ్లు ఔషధంగా పని చేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. వీటిలో క్యాల్షియం, ఐరన్, పాస్పరస్, విటమిన్-సి ఎక్కువగా ఉంటాయి. మంచి రుచితో పాటు పోషకాలు ఉండడంతో మార్కెట్లో వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది. పిఠాపురం నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారులు వీటిని అమ్ముతున్నారు. కేజీ పండ్లను రూ. 200 నుంచి రూ.250 వరకూ విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు అస్సలు వెనుకాడడం లేదు.

మిషన్ వాత్సల్యపై అవగాహన పెంచాలి



గొల్లప్రోలులో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

పిఠాపురం: పేద పిల్లలకు ఆసరా కల్పించే మిషన్ వాత్సల్యపై విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలకు అవగాహన కల్పించాలని పిఠాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ సీహెచ్ దుర్గాదేవి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. గొల్లప్రోలు నగర పంచాయతీలో సోమవారం నిర్వహించిన పోషణ పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు, అన్న ప్రాసన, వేల్ బేబీ షోలు ఎలా నిర్వహించాలనే విషయాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా పలువురు గర్భిణులకు సామూహిక సీమంతాలు చేసి వారికి పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. గొల్లప్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ మానసాదేవి, గొల్లప్రోలు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు, కౌన్సిలర్ గండ్రేటి శ్రీరామచంద్రమూర్తి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు పర్ల రాజా, వైస్ చైర్‌పర్సన్లు తెడ్లపు అలేఖ్యారాణి, గంధం నాగేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'పది'ష్టంగా పరీక్షలు

- పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు
- అధికారులకు సైతం సెల్‌ఫోన్లు నిషేధం



పిఠాపురం ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ శ్రీనివాస్



పిఠాపురం ఓబీఎస్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



సామర్లకోటలోని బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

పిఠాపురం: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 8 గంటల నుంచే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థుల సందడి ప్రారంభమైంది. ఉదయం 9.15 గంటలకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. తొలిరోజు కావడంతో పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్ష కేంద్రానికి తీసుకువచ్చి దగ్గరుండి పంపించారు. విద్యార్థులు నిర్ణీత సమయంలోనే పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంతో తొలిరోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పిఠాపురం పట్టణంలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో 1289 మంది విద్యార్థులకు గాను 1280 మంది పరీక్షలకు హాజరయ్యారు. తొమ్మిది మంది గైర్హాజరైనట్టు అధికారులు తెలిపారు. పిఠాపురం మండలంలో 370 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 369 మంది పరీక్షలు రాశారు. ఒకరు గైర్హాజరయ్యారు. గొల్లప్రోలు నగర పంచాయతీ, మండలంలో 1120 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 1111 మంది పరీక్షలు రాయగా 9 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు డీవైఈఓ సుభద్ర తెలిపారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ఈ ఏడాది పదో తరగతి పరీక్షలను అత్యంత పగడ్బందీగా నిర్వహిస్తున్నారు. పరీక్ష కేంద్రాలకు హాజరయ్యే అధికారులకు సైతం పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్ వాడకంపై నిషేధం విధించారు. డ్యూటీ పడిన అధికారులను సైతం క్షుణ్ణంగా తనిఖీలు చేసి సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని లోపలికి అనుమతించారు. ఇతరులను పరీక్ష కేంద్రాల బయటకు మాత్రమే అనుమతించిన అధికారులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పిఠాపురం నియోజకవర్గంలోని పిఠాపురం పట్టణంతో పాటు మండలంలోని పరీక్ష కేంద్రాల వద్ద పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

కొత్తపల్లి: మండలంలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కొత్తపల్లి, మూలపేట, కొమరగిరి జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని ఐదు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. మండలంలో పరీక్షలకు 1041 మంది విద్యార్థులు హాజరుకావల్సి ఉండగా 1031 మంది విద్యార్థులు హాజరై 10 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ వేణుగోపాల్ తెలిపారు. కొత్తపల్లి హైస్కూల్ ఎ సెంటర్‌లో 204 మంది, బి సెంటర్‌లో 221 మంది, మూలపేట 209 మంది, వీపీఎస్ సూక్‌ల్‌లో 196 మంది, కొమరగిరి 201 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

19 మంది విద్యార్థులు గైర్హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభం అయ్యాయి. మండల పరిధిలో తొమ్మిది పరీక్షా కేంద్రాల్లో 1,635 మంది విద్యార్థులు పరీక్షలు రాయవలసి ఉండగా 1,616 మంది రాశారు. సీఐ కె.దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ఎల్.గణేష్‌బాబు ఆధ్వర్యంలో స్క్వాడ్ వేట్లపాలెంలో రెండు సెంటర్లు, బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, ప్రతిభ పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసింది. ఈ స్క్వాడ్ లో ఎంఈఓ వై.శివరామ కృష్ణయ్య, కరప ఎంఎస్‌ఓ శ్రీనివాసరావు, ఎస్సై సీహెచ్ గోపాలకృష్ణ ఉన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద చీఫ్‌లతో సహా ఎవరి వద్దా సెల్‌ఫోన్లు చర్యలు తీసుకున్నారు. బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో 211 మందికి 208 మంది, ప్రభుత్వ హైస్కూల్‌లో 191 మందికి 186, ప్రతిభా విద్యానికేతన్‌లో 182 మందికి 181, జిల్లా పరిషత్తు బాలికోన్నత పాఠశాలలో 182 మందికి 181, వేట్లపాలెం హైస్కూల్ ఏలో 195 మందికి 193, హైస్కూల్ బీలో 195 మందికి 189, నవర హైస్కూల్‌లో 153 మందికి 153, వీకే రాయపురం హైస్కూల్‌లో 150 మందికి 150, ఉండూరు హైస్కూల్‌లో 176 మందికి 175 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్టు మండల విద్యాశాఖాధికారి వై. శివరామకృష్ణయ్య తెలిపారు.

పెద్దాపురంలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలించిన ఆర్జేడీ

పెద్దాపురం: పదవ తరగతి పరీక్షలు బుధవారం పెద్దాపురం డివిజన్‌లో అన్ని పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. ఎక్కడా మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ సత్యన్నారాయణ తెలిపారు. పెద్దాపురం అర్బన్, రూరల్‌కు సంబంధించి 8 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఆయా పరీక్షా కేంద్రాల్లో 1,547 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,544 మంది హాజరయ్యారన్నారు. ముగ్గురు పరీక్షలకు గైర్హాజరు కాగా 99.68 శాతం విద్యార్థులు పరీక్షలు రాసినట్లు ఆయన తెలిపారు.

మోటారు సైకిళ్లు దగ్ధం



కాలి బూడిదైన మోటారు సైకిళ్లు

పిఠాపురం: ఇంటి ముందు పార్కింగ్ చేసి ఉన్న రెండు మోటారు సైకిళ్లు అగ్నికి ఆహుతైనట్టు పట్టణానికి చెందిన పిల్లి శివ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల కథనం ప్రకారం... పిఠాపురం మారెమ్మతల్లి గుడి దగ్గర చిన్నఅర్జున్‌రావుపేటలో నివాసముంటున్న పిల్లి శివ తన ఇంటి ముందు ప్రతిరోజూ రాత్రి తన అన్నదమ్ములకు చెందిన రెండు మోటారు సైకిళ్లు పార్కింగ్ చేస్తుంటాడు. ఎప్పటి లాగే ఆదివారం రాత్రి మోటారు సైకిళ్లను పార్కింగ్ చేసి ఇంట్లో నిద్రిస్తుండగా అర్ధరాత్రి పక్కింటి వారు లేపి మోటారు సైకిళ్లు కాలిపోతున్నట్లు చెప్పడంతో మంటలు ఆర్పే ప్రయత్నం చేశాడు. కాగా అప్పటికే అవి పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎవరో కావాలనే మోటారు సైకిళ్లను దహనం చేసినట్లు అనుమానిస్తున్నారు. దీనిపై పట్టణ ఎస్సై జగన్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమన్వయంతో చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రమణ

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ (పీసీ, పీఎన్‌డీటీ) చట్టం పటిష్ట అమలుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కాకినాడ ఆర్డీవో బీవీ రమణ ఆదేశించారు. సోమవారం ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన లింగ నిర్ధారణ నిషేధ చట్టం -1994 అమలుపై డివిజన్ స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రియేట్ అథారిటీ, సలహా కమిటీ సమావేశంలో మాట్లాడారు. కాకినాడ డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన మొత్తం 101 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. 10 ప్రభుత్వ ఆసుపత్రులు ఉన్నాయన్నారు. అల్ట్రాసౌండ్ వైద్య పరీక్షలను లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్టరీత్యా నేరమని, నిబంధనలకు విరుద్ధంగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్లలో 49 డెకాయ్ ఆపరేషన్లు, 289 ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు ఆర్డీవో వివరించారు. డివిజన్ స్థాయి ప్రోగ్రామ్ అధికారులు, క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధ చట్టం పరిధిలోని లక్ష్యాల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల స్థాయిలో చట్టంపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో ఫిర్యాదుకు సంబంధించి 18004253365 టోల్‌ఫ్రీ నంబరును తప్పనిసరిగా ప్రదర్శించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. బాలికల సంరక్షణకు గ్రామస్థాయిలో ఏఎన్‌ఎం, ఆశా, అంగన్‌వాడీ సిబ్బందిని భాగస్వాములను చేయాలని ఆర్డీవో రమణ అన్నారు. డీఐవో డాక్టర్ ఐ.ప్రభాకర్, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్.కృష్ణారావు, గైనికాలజిస్టు డాక్టర్ నూరున్నిసా బేగం, రేడియాలజిస్టు డాక్టర్ ఎం.కీర్తిప్రియ, ఎన్‌జీవో ప్రతినిధులు కె.సింహాద్రి, కాకినాడ డివిజన్ సీడీపీవోలు హాజరయ్యారు.

స్పందనకు 12 అర్జీలు



అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ సీతారామారావు

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతీ వారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని పెద్దాపురం ఆర్డీఓ జె.సీతారామారావు అన్నారు. వారం వారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో భాగంగా డివిజన్‌లో ఆయా మండలాల నుంచి 12 అర్జీలు అందినట్లు ఆర్డీఓ తెలిపారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతీ అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. డీఎల్‌డీఓ కేఎస్‌వి ప్రసాద్, డీఎల్‌పీఓ బాలామణి, సహకార శాఖ నుంచి మసకపల్లి రంగనాయకులు, గృహ నిర్మాణ శాఖ ఈఈ రాజు, ఐసీడీఎస్ సీడీపీఓ జి.ఉష, వ్యవసాయ ఏడీఏ దైవకుమార్, పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయ ఏఓ సరస్వతి, డిటీ భానుకుమార్, ఎంఈఓ సత్యన్నారాయణ, మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

ప్రత్తిపాడు: ఆటోలో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి, అతని నుంచి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు స్థానిక పోలీసులు సోమవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెదశంకర్లపూడి నుంచి పొన్నాడ ఏసుబాబు మరో వ్యక్తి కలిసి ఆటోలో సారా తరలిస్తున్నారు. స్థానిక జాతీయ రహదారిపై నరేంద్రగిరి సమీపంలో పోలీసులు ఆటోను నిలుపుదల చేసి తనిఖీ చేయగా పది లీటర్ల సారా పట్టుబడింది. ఆటోలో ఉన్న నిందితుడు పరారీ కాగా ఆటో డ్రైవర్ పొన్నాడ ఏసుబాబును అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచారు. ఆటోను, సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం సేకరణకు సిద్ధం కండి

కాకినాడ సిటీ: రబీ సీజన్ ధాన్యం పూర్తి స్థాయిలో సేకరించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎస్. ఇలక్కియ అధికారులను ఆదేశించారు. సోమవారం జేసీ చాంబర్‌లో 2022–23 రబీ సీజన్‌కు సంబంధించి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో ధాన్యం సేకరించేందుకు అవసరమైన గోనె సంచుల కొరత లేకుండా రైతు భరోసా కేంద్రాల వద్ద సిద్ధం చేయాలని ఆదేశించారు. కస్టోయన్ అధికారులను నియమించాలని, బ్యాంక్ గ్యారంటీలు సేకరించాలని, రైతు భరోసా కేంద్రాలను రైస్‌మిల్లులకు అనుసంధానం చేయాలని పౌరసరఫరాల అధికారిని జేసీ ఇలక్కియ ఆదేశించారు. రైస్ మిల్లర్లతో మంగళవారం సమావేశం ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు కావల్సిన చర్యలు చేపట్టాలని పౌరసరఫరాల మేనేజర్‌ను జేసీ ఆదేశించారు. సాంకేతిక సిబ్బందిని, డేటా ఎంట్రీ ఆపరేటర్లను, పూర్తి స్థాయిలో నియమించాలని, రైతు భరోసా కేంద్రాల వద్ద కంప్యూటర్లు, ప్రింటర్లు ఏర్పాటు చేయాలని, రైతులకు హమాలీలను, రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లా కోపరేటివ్ అధికారిని జేసీ ఇలక్కియ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ డి పుష్పామణి, జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, జిల్లా కోఆపరేటివ్ అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాట్యసిరి పురస్కారాలు



నాట్యసిరి పురస్కారాలు స్వీకరిస్తున్న నృత్యనికేతన్ విద్యార్థులు

కాకినాడ కల్చరల్: కాకినాడకు చెందిన శ్రీబాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థినులకు నాట్యసిరి పురస్కారాలు ప్రదానం చేశారు. తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ సౌత్‌ఆఫ్రికా సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నాట్యోత్సవం పేరుతో కూచిపూడి, భరతనాట్యం, జానపదం నృత్య వేడుకలు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. నాట్యోత్సవంలో శ్రీబాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ విద్యార్థినులు నృత్య ప్రదర్శనలు చేసి మెప్పించారు. వీరికి నాట్యసిరి పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. నాట్యగురువు బేతా సత్యనారాయణకు నాట్యరత్న పురస్కారం ప్రదానం చేశారు. పురస్కారాలు నృత్యరంగంపై మరింత బాధ్యతలు పెంచాయని బేతా అన్నారు. నగర ప్రముఖులు వీరిని అభినందించారు.

'బార్' ఎన్నికలకు ముగింపురోజు 12 నామినేషన్లు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2023–24 సంవత్సరానికి ఈ నెల 17న జరిగే బార్ ఎన్నికలకు సోమవారం 12 నామినేషన్లు దాఖలయ్యాయి. ముగింపు రోజున అధ్యక్ష పదవికి ముగ్గురు సీనియర్ న్యాయవాదులు ముత్తింటి విశ్వేశ్వరరావు, ఏలూరి సుబ్రహ్మణ్యం, కె.జాన్ జోసెఫ్ నామినేషన్లు దాఖలు చేశారు. జనరల్ సెక్రటరీగా వి.సత్యనారాయణ, జాయింట్ సెక్రటరీగా అనిశెట్టి గంగాధర్ నామినేషన్లు దాఖలు చేశారు. స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా దొంతుమళ్ళ అశోక్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా కె.దయానంద్‌రాజు ,మహిళా ప్రతినిధి జి.నాగ సునీత, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా ఏవీసీహెచ్‌ఎస్ సత్యనారాయణమూర్తి, సీనియర్ కమిటీ మెంబర్‌గా జి.వెంకట దుర్గాప్రసాద్, మహిళా కమిటీ మెంబర్‌గా ఎం.సరోజిని, జూనియర్ కమిటీ మెంబర్‌గా యు.ఉమాగౌరీ నామినేషన్లు దాఖలు చేశారు.

డాక్టర్ శ్రీనివాసనాయక్‌కు పురస్కారం

కరప: స్థానిక పీహెచ్‌సీలో పనిచేస్తున్న డాక్టర్ రామావత్ శ్రీనివాసనాయక్‌కు ఉగాది జాతీయ మహానంది పురస్కారం లభించింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలకు చెందిన తెలుగు వెలుగు సాహితీ సంస్థ (స్వచ్ఛంద సేవాసంస్థ) వైద్యసేవలకు గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేసింది. హైదరాబాద్‌లోని త్యాగరాయ గానసభ కళావేదికలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసనాయక్‌ను సత్కరించి, పురస్కారాన్ని ఆ సంస్థ ప్రముఖులు పాలోజు రాజ్‌కుమార్, దైవజ్ఞ శర్మ, గిన్నిస్‌బుక్ రికార్డ్ గ్రహీత డాక్టర్ శాంతికృష్ణశ్రీ, బ్రహ్మశ్రీ పాలోజు భాస్కరాచార్యులు, డాక్టర్ జి.రామలింగం అందజేశారు.

అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ అధ్యక్షుడిగా 'విప్పర్తి'

కాకినాడ సిటీ: అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా విప్పర్తి నిఖిల్‌కృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాకినాడ స్మార్ట్ సిటీ మీటింగ్ హాలులో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో 26 జిల్లాల అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజినీర్స్ కార్యవర్గ సభ్యులు పాల్గొని కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు నిఖిల్‌కృష్ణ మాట్లాడుతూ సెక్రటేరియట్ విభాగంలో 10,000 మంది సభ్యులున్నామని, ఏ సమస్య వచ్చినా పరిష్కరించుకోవచ్చన్నారు. అసోసియేట్ అధ్యక్షుడిగా ఫరూక్ జాన్, ప్రధాన కార్యదర్శిగా సల్మాన్‌బాషా, వుమెన్ కార్యదర్శిగా కట్రేసీ, కోశాధికారిగా యువషణ్ముఖ్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.